మాగంటి గోపీనాథ్‌కు ఘన నివాళి

మెహిదీపట్నం, జూన్ 8 : ప్రజల నాయకుడిగా ఉంటూ అనారోగ్యంతో ఆకస్మికంగా మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్‌కు ఆదివారం నాంపల్లి, కార్వాన్ నియోజకవర్గాల నాయకులు ఘనంగా నివాళులర్పించారు. నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ మహా ప్రస్థానంలో జరిగిన మాగంటి గోపీనాథ్ అంత్యక్రియలలో పాల్గొని నివాళులర్పించారు. నాంపల్లి నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి సీహెచ్ ఆనంద్‌కుమార్‌గౌడ్, కేసీశేఖర్‌రెడ్డి గోపీనాథ్‌కు నివాళులర్పించారు.

సహచర ఎమ్మెల్యేను కోల్పోవడం బాధాకరం

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ మృతి కలచివేసిందని కార్వాన్ ఎమ్మెల్యే మమ్మద్ కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. ఆదివారం టోలిచౌకి హకీంపేటలో ఆయన కార్యకర్తలతో కలిసి పలు ప్రాంతాలలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే నాయకుడు మాగంటి గోపీనాథ్ అని కొనియాడారు.

గోపీనాథ్ మృతి పార్టీకి తీరనిలోటు..

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే గోపీనాథ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకుడు అనిల్‌యాదవ్

కాచిగూడ : జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అకాల మృతి పార్టీకి తీరనిలోటని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జంగాల అనిల్‌కుమార్‌యాదవ్ అన్నారు. ఆదివారం అకాల మృతి చెందిన ఎమ్మెల్యే గోపీనాథ్ చిత్రపటానికి నింబోలిఅడ్డాలోని హర్రస్ పెంటలో అనిల్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గోపీనాథ్ కు అవంతి కళాశాలల చైర్మన్ శ్రీనివాసరావు సంతాపం

కాచిగూడ, జూన్ 8: కొంత కాలంగా అనారోగ్యంతో బాధ పడుతూ ఆదివారం ఉదయం మృతి చెందిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌కు మాజీమంత్రి, అవంతి కళాశాల చైర్మన్ శ్రీనివాసరావు తీవ్ర సంతాపం ప్రకటించారు. ఆదివారం రాత్రి బర్కత్ పుర అవంతి కళాశాలలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేస్తూ, పార్టీకి ఎంతో కీర్తిని తీసుకువచ్చాడని పేర్కొన్నారు. నగరంలో బీఆర్ఎస్ పార్టీకి ఎన్నో విజయాలను అందజేసిన మహోన్నత నేత గోపీనాథ్ అని అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సన్మానం కాచిగూడ, జూన్ 8: అలయ్ బలయ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బండారు దత్తాత్రేయ ఆత్మకథ పుస్తకావిష్కరణ కార్యక్రమంలో కాచిగూడ కార్పొరేటర్ ఉమాయాదవ్, ఉపాధ్యక్షుడు కన్నె రమేశ్‌యాదవ్ పాల్గొని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయను అభినందించి, శాలువాతో ఘనంగా సన్మానించారు. భీమ్‌రాజ్, సంతోష్, రవి యాదవ్, వాసు, మల్లికార్జున్ పాల్గొన్నారు.

భక్తి, శ్రద్ధలతో రేణుకా ఎల్లమ్మ ప్రాణప్రతిష్ఠ

గోల్నాక శంకర్ నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

గోల్నాక, జూన్ 8: గోల్నాక డివిజన్ శంకర్ నగర్ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఎల్లమ్మ తల్లి ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి హోమం, మహా పూర్ణాహుతితో పాటు పలు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, కార్పొరేటర్ దూసరి లావణ్య (శ్రీనివాస్‌గౌడ్ హాజరై అమ్మవారికి పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శంకర్ నగర్ దేవాలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. అదేవిధంగా స్థానిక కార్పొరేటర్ కార్పొరేటర్ దూసరి లావణ్యశ్రీనివాస్ గౌడ్ హాజరై పూజలు చేశారు.

బీఆర్ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి పూజలు..

అంబర్‌పేట : గోల్నాక డివిజన్ శంకర్‌నగర్‌లో శ్రీ రేణుక ఎల్లమ్మ ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకుడు బి.వెంకటరెడ్డి పాల్గొని పూజలు చేశారు. కమిటీ ప్రతినిధులు ఆయనను సత్కరించారు.

10న హిందీ ప్రచార సభ వార్షికోత్సవాలు

రవీంద్రభారతి, జూన్ 8: తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలలో హిందీ భాషాభివృద్ధికి విశేష కృషి చేసి వేలాది మందిని అధ్యాపకులుగా తీర్చిదిద్దిన హిందీ ప్రచార సభ హైదరాబాద్ సంస్థ 90వ వార్షికోత్సవాలను నిర్వహిస్తామని హిందీ ప్ర చార సభ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి ఎస్. గైబువల్లి, అధ్యక్షుడు ప్రొఫెసర్ చంద్రదేవ్ కావడేలు ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్‌వర్మ, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, సెంట్రల్ హిందీ డైరెక్టర్ ప్రొఫెసర్ సునీల్ బాబురావు కులకర్ణి తదితరులు హాజరవుతారన్నారు. ప్రొఫెసర్ సురేశ్‌పురి, గిరిధర్‌రావు, శృతి కకాంత్ భారతి, డా.సుష్మాదేవి తదితరులు పాల్గొన్నారు.

సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభం

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు కె. నారాయణ

మాదాపూర్ : కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో సీఆర్ పాలిక్ క్లినిక్ సిటీ స్కాన్ శ్రీసత్య బొల్లి ప్రొఫిలిక్స్‌తో ఈ సిటీస్కాన్ 32-96 స్లైట్స్‌తో సిటీ రిపోర్టింగ్ రూం ప్రారంభించారు. సీఆర్ ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కే నారాయణ విచ్చేసి ఫౌండేషన్ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. చుట్టుప్రక్కల ప్రజలకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉండేలా ఉపయోగించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ డెక్కన్ ప్రెసిడెంట్ జస్వీందర్ బార్గి, కార్యక్రమ కో - ఆర్డినేటర్ నితీశ్, సీఆర్ఎఫ్ గౌరవాధ్యక్షుడు, డాక్టర్ కె. నారాయణ, డిస్ట్రిక్ట్ గవర్నర్ శరత్ చౌదరి, శ్రీ సత్య బొల్లి, డాక్టర్ జయం చుక్క, ప్రో.డి. ప్రసాద్‌రావు పాల్గొన్నారు.

శాస్త్రీయ నృత్య కళా ప్రక్రియలు ఔషధంగా పనిచేస్తాయి

వేదికపై నృత్య ప్రక్రియలను ప్రదర్శిస్తున్న కళాకారులు

తెలుగుయూనివర్సిటీ, జూన్ 8 : భారతీయ శాస్త్రీయ సంప్రదాయ నృత్యరీతులను అవపోసన పట్టిన ఔత్సాహిక కళాకారులకు ధ్రువ పత్రాల పంపిణీ కార్యక్రమం తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో ఆదివారం సాయంత్రం ఘనంగా జరిగింది. శివానంద లహరి సంగీత, నృత్య, ఫైన్ ఆర్ట్స్ అకాడమీ గురువు యశశ్రీ పర్యవేక్షణలో భారతీయ కళా సంస్కృతులను ప్రతిబింబించే అంశాలలో శిక్షణ పొందిన వారికి ధ్రువ పత్రాలను కేంద్ర సంగీత అకాడమీ అవార్డు గ్రహీత సురభి ఆర్.వేణుగోపాలరావు ముఖ్య అతిథిగా హాజరై అందజేశారు. కళా ప్రక్రియలు ఒత్తిడిలో ఉన్న సమాజానికి ఔషధంగా పని చేస్తాయని అన్నారు. గొప్ప కళాకారులుగా చిన్నారులను తీర్చిదిద్దుతున్న గురువుల కృషిని ప్రశంసించారు. ఈ సందర్భంగా కళాకారులు పలు అంశాలను ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. గురువులు శ్యామల శ్రీనివాస్, డాక్టర్ ఎం. జంపాల రాణి, కి జయశ్రీ, సంస్థ అధ్యక్షులు బి. వివేకానంద, బి. జ్యోతి పాల్గొని చిన్నారి కళాకారులను అభినందించారు.

కాచిగూడ రైల్వే స్టేషన్‌కు లైటింగ్

విద్యుత్ కాంతుల మధ్య కాచిగూడ రైల్వే స్టేషన్

అంబర్‌పేట, జూన్ 8 : కాచిగూడ రైల్వే స్టేషన్‌కు లైటింగ్ ఏర్పాటు చేశారు. రూ. 2.23 కోట్ల వ్యయంతో కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ ఫసాద్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేసింది. దీన్ని కేంద్ర మంత్రి జీ కిషన్ రెడ్డి ఈనెల 9వ తేదీన జాతికి అంకితం చేయనున్నారు. చారిత్రక కట్టడాలకు నూతన శోభను తీసుకువచ్చి ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. నిజాంల ఏలుబడిలో 1916 లో 'గోతిక్ శైలి'లో కాచిగూడ రైల్వేస్టేషన్ నిర్మాణం జరిగింది. కాచిగూడ రైల్వేస్టేషన్‌కు ఉన్న ఈ చారిత్రక నేపథ్యాన్ని నిర్మాణ శైలిని మరింత ఆకర్షణీయంగా చూపించడానికి మొత్తం 785 ఇల్యుమినేషన్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇకపై ఈ లైట్ల వెలుగులో కాచిగూడ రైల్వేస్టేషన్ బిల్డింగ్ ఎంతో చూడముచ్చటగా కనిపించనుంది.

జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు పంపిణీ

జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలను పంపిణీ చేస్తున్న విజితారెడ్డి

కాచిగూడ, జూన్ 8 : పేద ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో ప్రతి ఒక్కరూ పనిచేయాలని సంఘ సేవకురాలు దేవిరెడ్డి విజితా రెడ్డి అన్నారు. విమలాసుధాకర్‌రెడ్డి ఫౌండేషన్ చైర్మన్ విజితారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం కూచి కుళ్ల విమలాసుధాకర్‌రెడ్డి వర్ధంతిని పురస్కరించుకొని బర్కత్ పుర డిపో సమీపంలో జీహెచ్ఎంసీ కార్మికులకు చీరలు, పండ్లు, బ్రెడ్ పాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులకు మగవాళ్లే వర్ధవంతులు, తదితర కార్యక్రమాలు చేస్తారన్న అపోహలను ఆడవాళ్లు కూడా చేస్తారని నిరూపించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఫౌండేషన్ సెక్రటరీ శ్వేత, సుశీల, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల ఫీజులు పెంచొద్దు

కాచిగూడ, జూన్ 8: రాష్ట్ర ప్రభుత్వం ఇంజినీరింగ్, వృత్తి విద్యా కోర్సుల ఫీజులను పెంచి పేద విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తుందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. ఆదివారం నింబోలిలో ఆయన మాట్లాడు తూ.. ఇంజినీరింగ్ కళాశాలల్లో ఫీజులను పెంచాలనే రెగ్యులేటరీ కమిటీ ప్రతిపాదనను ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బి-కేటగిరి సీట్లను ఆన్ లైన్ కౌన్సిలింగ్ ద్వారా భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అధిక డొనేషన్లు వసూలు చేస్తున్న ఇంజినీరింగ్ కళాశాలలను సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. భూషణ్ భాస్కర్, డాక్టర్ ప్రశాంత్ నిమ్కర్, పులిజాల కృష్ణ, ముత్యాల్ రావు పాల్గొన్నారు.

జనరంజని మ్యూజికల్ సంస్థ వార్షికోత్సవం

గాయనీగాయకులతో సామల రమేశ్, అరుణకుమార్ తదితరులు

రవీంద్రభారతి, జూన్ 8 : జనరంజని మ్యూజికల్ సంస్థ 3వ వార్షికోత్సవాలు ఆదివారం రవీంద్రభారతిలో ఘనంగా నిర్వహించారు. జనరంజని సర్వే సమ్మేళన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, సినీ దర్శకులు సామల రమేశ్, ఖాజాపాషా, గాయకులు వరికుప్పల యాదగిరి పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి పలువురి గాయకులకు, సంగీత దర్శకులకు, కళాకారులకు పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. అరుణకుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ.. జనరంజని మ్యూజికల్ సంస్థ 3 వ వార్షికోత్సవాలను నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. గాయకురాలు అరుణకుమారిని పురస్కారంతో ఘనంగా సత్కరించి అభినందించారు.

హిందూ సామ్రాజ్య దినోత్సవ శోభాయాత్ర

ర్యాలీలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు, స్థానికులు

దుండిగల్ : హిందూ సామ్రాజ్య దినోత్సవం సందర్భంగా నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ప్రగతి నగర్‌లో హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం శోభాయాత్ర నిర్వహించారు. హిందువులందరూ అరబ్, మొఘుల్ మతోన్మాద ఇస్లాం పాలకుల దారుణాలకు దిక్కుతోచని స్థితిలో ఉన్నప్పుడు ఆశాకిరణంలా జన్మించిన ఛత్రపతి శివాజీ మహారాజ్ హిందూ మహా సామ్రాజ్య పట్టాభిషిక్తుడైన జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజును హిందూ సామ్రాజ్య దినోత్సవంగా జరుపుకుంటామన్నారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘం (ఆర్ఎస్ఎస్) పిలుపుమేరకు హిందూ సంఘాలు నిర్వహించిన శోభాయాత్రలో అశేషంగా హిందువులు పాల్గొనడం సంతోషకరమన్నారు. ప్రగతి నగర్ కోతిబొమ్మల సెంటర్ నుంచి రహదారుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. వివిధ సంస్థలు, పార్టీలకు చెందిన డా.ఎమ్ఆర్ఎస్ రాజు, మధుజీ, కంతేటి సుబ్బారావు, సత్య కాటేపల్లి, రచ్చ చక్రధర్, లక్ష్మీ రామారావు, భిక్షపతి యాదవ్, శేషారావు, నరేంద్ర చౌదరి, శ్రీనివాస్ గుప్తా, దాసి నాగరాజు, సుమన్ రావు, కిశోర్, వెంకటేశ్, కౌశిక్ నాయుడు, లింగారెడ్డి, వినీత్, అశోక్, భారతి, శిల్ప, కల్యాణి, సూర్య నారాయణ, డా.వెంకన్న, జనార్దన్ రెడ్డి, మధుసూదన్, రాజశేఖర్ రెడ్డి, బాలాజీ నాయక్, భరత్ రెడ్డి పాల్గొన్నారు.

ప్లాట్‌ఫాంపై వృద్ధుడు మృతి

కాచిగూడ, జూన్ 8: అనారోగ్యంతో వృద్ధుడు మృతి చెందిన ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ కె. రవికుమార్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(70)ఆదివారం శివరాంపల్లి రైల్వే స్టేషన్ ఫ్లాట్ ఫాం- 1 బుకింగ్ కౌంటర్ సమీపంలో అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్త ఉస్మానియా మార్చురికి తరలించారు. వివరాలకు 9573948545 లో సంప్రదించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

మైలార్‌దేవ్‌పల్లి, జూన్ 8: ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నైపుణ్యాన్ని మరింత పెంచుతుందని అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు వెల్లడించారు. ఆచార్య ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ఆదివారం కూడా అత్తాపూర్ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి బడీడు పిల్లలను గుర్తించి వారిని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం వల్ల జరిగే ఉపయోగాలను తెలియజేశారు. అధునాతన టాయిలెట్స్, మంచినీటి సౌకర్యం, పిల్లలు ఆడుకునేందుకు ప్లే గ్రౌండ్, ఆట సామగ్రి, విశాలమైన తరగతి గదు లు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు విద్యాబుద్ధులు నేర్పిస్తారని సూచించారు. నాణ్యమైన విద్యతో పాటు మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్‌లు సైతం ఉచితంగా అందిస్తామని వివరించారు. ఉపాధ్యాయులు రోజా రాణి, హేమలత, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

దళితుల సమస్యలు పరిష్కరించాలి

హిమాయత్ నగర్, జూన్ 8: దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ దళిత హక్కుల పోరాట సమితి నగర కార్యదర్శి రాజ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్ నగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాలరాస్తూ వారికి దక్కాల్సిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందకుండా కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. దళితులు తమ హక్కులు, చట్టాలను తెలుసుకోనంత కాలం దోపిడీకి గురికాక తప్పదన్నారు. మూసీ ప్రాంతాల్లో నివాసం ఉండే దళితులకు ప్రభుత్వమే ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

రోడ్డును ఆక్రమించి నిర్మాణం

బాచుపల్లి రాజీవ్‌గాంధీ నగర్‌లో రోడ్డును ఆక్రమించి చేపట్టిన నిర్మాణం

దుండిగల్, జూన్ 8 : రోడ్డును ఆక్రమించి దర్జాగా నిర్మాణాలు చేపడుతున్నారు కొందరు అక్రమార్కులు. ఇదేమని అడ్డగించిన స్థానికులపై చిందులు వేస్తున్నారు. పైగా తమకు పొలిటికల్ అండదండలు ఉన్నాయి.. అంటూ బెదిరింపులకు దిగుతున్నారు. వివరాల్లోకి వెళ్తే .. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్, 15వ డివిజన్, రాజీవ్‌గాంధీ నగర్‌లోని మజీద్ రోడ్డులో ఓ వ్యక్తి తనకున్న 100 గజాల స్థలంలో ఇంటి నిర్మాణ పనులు మొదలుపెట్టారు. అయితే మెట్లు నిర్మాణం కోసం 5 ఫీట్లరోడ్డు స్థలాన్ని ఆక్రమించి పిల్లర్లు వేసేందుకు ప్రయత్నిస్తుండగా, స్థానికులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. రోడ్డును ఆక్రమించి నిర్మాణాలు ఎందుకు చేపడుతున్నారని ప్రశ్నించగా.. అంతా మా ఇష్టం ఏం చేసుకుంటారో చేసుకోండి.. అంటూ స్థానికులతో వాగ్వాదానికి దిగారు. గతంలో ఎంతవరకైతే నిర్మాణం ఉందో అంతవరకు నిర్మాణం చేపడితే ఎవరికీ అభ్యంతరం లేదని స్థానికులు చెప్పినప్పటికీ నిర్మాణదారులు ఎవరి మాటలు వినకుండా పెడచెవిన పెడుతూ తమ పని కానిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసిన తమకు ఎటువంటి భయం లేదని నిర్మాణదారులు పేర్కొనడంతో బస్తీ వాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

శిల్పారామంలో బెంగళూరు కళాకారులు

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా బెంగళూరు కూచిపూడి కళాకారుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మాదాపూర్‌లోని శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనల్లో గురువులు లాస్య ఎడార శిష్య బృందం ప్రదర్శనలు అలరించాయి. సాయి రాగ, తేజస్విని, శ్రీ లాస్య, మాన్విత, శాన్వి, అనన్య, సహస్ర, వైష్ణవి,రిత్విక, హర్షితరెడి ఆకట్టుకున్నది.

– కొండాపూర్

ఉచిత వినికిడి పరీక్షా శిబిరం

శబ్ద కాలుష్యం, వినికిడి సమస్యలపై జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచించారు. రంగారెడ్డి నగర్ డివిజన్ ఆదర్శనగర్‌లో ఆదివారం అంప్లిఫోన్ సంస్థ సహకారంతో ఉచిత శ్రవణ పరీక్ష శిబిరం నిర్వహించారు. అవసరమైన వారికి వినికిడి పరికరాలు సబ్సిడీలో అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. సీనియర్ సిటిజన్లు, భారీ శబ్దాలతో కూడిన యంత్రాల వద్ద పనిచేసేవారు జాగ్రత్తలతో పాటు తరచూ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు శంకరయ్య, వైద్యులు అభిషేక్, జయ, మేనేజర్ సాజన్ పాల్గొన్నారు. **– జగద్గిరిగుట్ట, జూన్ 8**

ఎర్రమట్టి అమ్ముకుంటున్న రైతులపై కేసు నమోదు

శంషాబాద్ రూరల్, జూన్ 8 : ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి అమ్ముకుంటున్న పలువురు రైతులపై రెవెన్యూ అధికారుల ఫిర్యాదుతో శంషాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో కేసు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మండలంలోని మల్కారం,నానాజీపూర్, రాయన్నగూడ,పెద్ద షాపూర్, చౌదర్‌గూడ గ్రామాల్లో ప్రభుత్వ భూముల్లో గుట్టుచప్పుడు కాకుండా ఎర్రమట్టిని అమ్ముకుంటున్నారు. దీంతో కొందరు వ్యాపారులను కొనుగోలు చేసి జేసీబీల సహాయంతో ప్రభుత్వ భూముల్లో పెద్దపెద్ద గుంతలు తీసి ఎర్రమట్టిని రాత్రికి రాత్రే వివిధ ప్రదేశాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు తెలిపారు. దీంతో ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టిని అమ్ముకుంటున్న కొందరు రైతులపై క్రిమినల్ కేసులు నమోదు చేసినట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.